

భూ వివాదం.. ఉద్రిక్తం

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని నెలకొన్న భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది.

8లో▸



ఆయిల్‌పామ్ సాగుతో..

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవనశాఖ అధికారి హిమబిందు అన్నారు.

8లో▸



కిరాణా షాపులపై దాడులు

విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా కొందుర్గులో బుధవారం పోలీసులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు.

8లో▸

న్యూస్‌రీల్

'రాష్ట్రీయ బాల్ పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

హుడాకాంప్లెక్స్: రాష్ట్రీయ బాల్ పురస్కార్ చిల్డ్రన్స్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్త్రీ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ జిల్లా అధికారి సీహెచ్.సంధ్యారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్రసాంకేతిక విషయాలు, పర్యావరణం, కళలు, సాంస్కృతిక రంగాల్లో విశేష ప్రతిభ చూపిన 5 నుంచి జూలై 31 వరకు 18 ఏళ్ల నిండిన బాలలు అర్హులు అని చెప్పారు. భారతదేశ పౌరసత్వం ఉన్న బాలబాలికలు నేషనల్ అవార్డ్స్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు https://awards.gov.in వైబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

ఆమనగల్లు సీఐ బదిలీ

నూతన సీఐగా జానకీరామ్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రమోద్‌కుమార్ బదిలీ అయ్యారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 11 మంది సీఐలను బదిలీచేస్తూ కమిషనర్ అవినాష్ మహంతి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆమనగల్లు సీఐగా పనిచేస్తున్న ప్రమోద్‌కుమార్‌ను రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సీఐగా బదిలీచేశారు. కాగా ఏసీబీలో పనిచేస్తున్న వి.జానకీరామ్‌రెడ్డిని ఆమనగల్లు సీఐగా నియమించారు. కడ్తాల సీఐ ఎస్.శివప్రసాద్‌ను సైబర్ క్రైం సీఐగా బదిలీ చేయగా అతనిస్థానంలో షామీర్‌పేట ఠాణాలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న చంద గంగాధర్‌ను కడ్తాల సీఐగా నియమించారు.

రేపు భూ సేకరణపై సమావేశం




భూసేకరణపై నోటీసులు జారీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

మంచాల: ఈ నెల 11న లోయపల్లి రెవెన్యూ క్లస్టర్ పరిధిలోని శ్రీమంతస్‌గూడలో భూసేకరణపై సమావేశం నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. వివరాలు.. శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణానికి గాను ప్రభుత్వం భూసేకరణకు నోటీసులు ఇచ్చింది. శ్రీమంత్‌గూడలో సర్వే నంబర్ 40 నుంచి 66 వరకు 148.31 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ సర్వే నంబర్లలో భూములు కోల్పోతున్న 267 మంది రైతులతో శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి భూసేకరణ నిర్వహించే ప్రదేశంలో ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో హాజరై సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఫీల్డ్‌ఆఫీసర్ యాట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రైతు రుణమాఫీకి డిమాండ్

- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- హాజరైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం



డీఆర్ఓ సంగీతకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్రంలోని రైతులందరికీ ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కె.మాధవరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డీఆర్ఓ సంగీతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏక కాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీకి డిమాండ్ చేశారు. 57 ఏళ్లు నిండిన రైతులకు వృద్ధాప్య పెన్షన్, స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ప్రకటించాలన్నారు. కిసాన్ సమ్మృద్ధి నిధిని రూ.6వేలకు పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బక్కని మల్లేశ్, గుండాల శివుడు, బాల్‌రెడ్డి, చల్లా నారాయణరెడ్డి, అంజయ్య, వెంకన్న, నర్సింహ, శ్రీనివాస్‌నాయక్, నర్సింహారెడ్డి, చతుర్‌నాయక్, హుస్సేన్, బాల్‌రాజ్, రేఖ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో బేస్‌మెంట్‌కే పరిమితమైన మోడల్ హౌస్

ఇందిరమ్మ ఇళ్లకు గ్రహణం

- ముగ్గు పోసి వదిలేసిన లబ్ధిదారులు
- బిల్లులు రాక నిలిచిన నిర్మాణాలు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి దశ నిధుల విడుదలకు గ్రహణం వీడట్లేదు. ఇప్పటికే నిధులు సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నా సర్కార్ ఇప్పటి వరకు లబ్ధిదారులకు నయా పైసా జమచేయలేదు. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసిన వారి ఫొటోలు, వివరాలు సేకరించిన అధికారులు ఆర్థికసాయం అందించే విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళనతో ఇళ్ల నిర్మాణంలో ముందడుగు పడడం లేదని చర్చలు వినిపిస్తున్నాయి.

మరిన్ని వార్తలు 9లో▸

20 ఇళ్ల మంజూరుకు ఇద్దరే నిర్మించారు

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రజలు అనాసక్తి చూపుతున్నారు. ఇళ్లు లేని పేద ప్రజలకు విడతల వారీగా నగదు ఇచ్చి వారికి సొంతంగా ఆవాసం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొత్తూరు మండలంలోని మక్తగూడను పైలట్ గ్రామంగా ఎంపిక చేసి మొదటి దశలో 20 ఇళ్లు మంజూరు చేసింది. ఏడుగురు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపగా నలుగురు నిర్మాణాలను ప్రారంభించారు. మక్తగూడ పంచాయతీ పరిధి పెద్దగుట్టతండాలో హరిపాల్ సింగ్, హుంకి నిర్మిస్తున్న ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తయింది. వారు అధికారులను సంప్రదించగా ఫొటోలు, వివరాలు సేకరించి ఉన్నాతాధికారులకు నివేదిక అందజేశారు. నేటికీ మొదటి విడత రూ.లక్షల మంజూరు కాకపోవడంతో ఎదురుచూపడం తప్పడం లేదు.

31 ఇళ్లకు మూడే..

ఆమనగల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నత్తనడకన కొనసాగుతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఒక్క ఇల్లు మంజూరు కాలేదు. మండలంలో 13 గ్రామాలకు.. మోడల్ విలేజిగా ఎంపికైన పోలపల్లి గ్రామానికి 31 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 10 ఇళ్లకు మార్కింగ్ చేశారు. ముగ్గురు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. బేస్‌మెంట్ వరకు నిర్మించినా మొదటి విడత సాయం అందలేదని వాపోతున్నారు. ఇదిలా ఉండగా.. పుర పరిధిలో ఇళ్లకోసం వేలాది దరఖాస్తులు రాగా.. 800 మందిని అర్హులుగా గుర్తించారు. మరోసారి దరఖాస్తులను అధికారులు పరిశీలించనున్నారు. కాగా.. లబ్ధిదారులకు నమూనాను చూపించేందుకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మూడు నెలల క్రితం ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. అదీ బేస్‌మెంట్‌కే పరిమితమైంది.

బిల్లులు ఇస్తే పూర్తి



ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పడంతో పనులు ప్రారంభించా. బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయింది. అధికారులు బిల్లుల వివరాలు తీసుకున్నారు. త్వరగా బిల్లులు మంజూరైతే నిర్మాణం పూర్తి చేసుకుంటా

– హరిపాల్‌సింగ్, పెద్దగుట్టతండా, మక్తగూడ పంచాయతీ



చిలుకూరు బాలాజీ స్వామివారికి గోప వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

గోవిందుడికి గోప వాహన సేవ

వైభవంగా కొనసాగుతున్న చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు గోప వాహన, హనుమంత వాహన సేవలు అందుకున్నారు. స్వామివారిని మొదటగా గోప వాహనంపై ఆశీనులను చేసి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిర్వహించిన హనుమంత వాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపారాయణం, పూజలు, మంగళహారతి సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, తిరుమల కిరణాచారి, నరసింహన్, కిట్టు, కృష్ణమూర్తి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం

బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి సూర్యప్రభ, గరుడ వాహన సేవలు నిర్వహించనున్నారు. రాత్రి 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: భద్రత, రక్షణ చర్యల్లో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉత్తమ సేవా అవార్డు వరించింది. బుధవారం రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ పి.సరస్వతికి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అరుణ్ బేహాల్ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తమ సేవలకు గుర్తింపుగా అవార్డు అందజేయడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఎయిర్‌పోర్టు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.శ్యామ్‌సుందర్, మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, ఆర్వో వి.వేణగోపాల్‌రెడ్డి, డీఈ వెంకన్న, ఏఈ వినీల్‌గౌడ్, అనూష, మమతారెడ్డి, మౌనిక ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మతోడు.. ఆస్తికోసం కాదు

- విష్ణు నా కార్లు దొంగిలించాడు
- మంచు మనోజ్ ఆరోపణ
- మంచు టౌన్ షిప్ వద్ద మరోసారి ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న మనోజ్


పహాడీషరీఫ్: జల్‌పల్లిలోని సినీ నటుడు మోహన్‌బాబుకు సంబంధించిన మంచు టౌన్‌షిప్ వద్ద మరోసారి వివాదం నెలకొంది. తాను లేని సమయంలో నార్సింగిలోని తన నివాసం వద్ద ఉన్న కార్లను విష్ణు దొంగలించాడని పేర్కొంటూ ఈ నెల 8న మంచు మనోజ్ నార్సింగి ఠాణాలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఉదయం 8.30 గంటలకు జల్‌పల్లి శివారులోని మంచు టౌన్‌షిప్ గేట్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మీడియాను లోనికి రానివ్వకుండా టౌన్‌షిప్ చుట్టూ కిలోమీటర్ సరిహద్దులో ఆంక్షలు విధించారు. పోలీసుల సూచనతో 11.45 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోతూ మనోజ్ మీడియా ఎదుట తన ఆవేదన వెలిబుచ్చారు.

అమ్మపై ప్రమాణం

గతేడాది డిసెంబర్ 8వ తేదీ నుంచి మంచుటౌన్‌షిప్‌లో ఆరంభమైన గొడవ రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. జల్‌పల్లిలో మొదలైన ఈ గొడవ కాలక్రమేణా తిరుపతిలోని మోహన్‌బాబు వర్సిటీ వరకు తాకింది. జల్‌పల్లిలో తాజాగా మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. మార్చి 27న తాను, తన భార్య ఇంట్లో ఉన్న సమయంలో బయటి వ్యక్తులు గుమిగూడుతున్న విషయమై పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డికి ఫోన్‌తో పాటు, 100 డయల్‌కు కాల్ చేసి రక్షణ కల్పించాలని కోరామన్నారు. అయినప్పటికీ తననే ఇంటి నుంచి బయటికి రావాలని పోలీసులు తెలిపారన్నారు. ఏప్రిల్ 2న తన కుమార్తె మొదటి పుట్టిన రోజు ఇక్కడే పరిమితంగా చేసుకుందామనుకున్నప్పటికీ, స్థానిక పరిస్థితుల దృష్ట్యా రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లామన్నారు. అంతకుముందే నేను అక్కడ లేను, విష్ణును అక్కడ ఏమైనా చేసుకోమని మా అమ్మకు కూడా తెలిపానన్నారు. అమ్మపై ప్రమాణం.. ఇది ఆస్తి కోసం కాదు అన్నారు. తిరుపతిలోని యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి తంతును ప్రశ్నించినందుకే ఈ పరిస్థితి ఎదురైందన్నారు. డిసెంబర్ 8 నుంచి ఇప్పటి వరకు పహాడీషరీఫ్ పోలీసులు ఒక్క ఛార్జిషీట్ కూడా దాఖలు చేయలేదని, టౌన్‌షిప్‌లో తనకు సంబంధించి మూడు పెట్ డాగ్‌లు, పిల్లలకు సంబంధించి వస్తువులున్నాయని తెలిపారు. అవి తీసుకొని వెళ్తానని చెప్పినా లోనికి వెళ్లనీయడం లేదన్నారు. పోలీసులకు అన్ని ఆధారాలు ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. తాను రాజస్థాన్‌కు వెళ్లిన వెంటనే విష్ణు తన కార్లను చోరీ చేశారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇంట్లో ఉన్న తన పాత జ్ఞాపకాలను సైతం తొలగించారన్నారు. రౌడీషీటర్ల ఆగడాలపై సీఐకి చెబితే 'అవునా పాపం' కదా అంటున్నారు తప్పా చర్యలు శూన్యమన్నారు. కోర్టులను తప్పదోవ పట్టిస్తున్న ఘటనలపై తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. కోర్టు ఆదేశాలున్నా ఇంట్లోకి రానివ్వడం లేదన్నారు. బైండోవర్ విషయం తనకు వర్తించినప్పుడు, విష్ణుకు ఎందుకు వర్తించవని ఆయన మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబం కోసం సినిమాలో స్త్రీ వేషధారణలోనూ నటించానని ఆవేదన వ్యక్తం చేశారు. మనోజ్ సంబంధించిన ఎలాంటి విషయాలైనా కావాలంటే.. ఇస్తా బిడ్డ అని నాన్న విష్ణుకు హామీ ఇచ్చారని తెలిపారు. పోలీసులు తన ఫిర్యాదులపై ఎక్కడ కూడా ఛార్జిషీట్‌లో దాఖలు చేయలేదన్నారు. ఇదిలా ఉండగా మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణు యూపీలో కన్నప్ప సినిమా ప్రమోషన్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను కలిసి సినిమా కథను వివరించారు.

చేప.. వలకు చిక్కదే!

- 700 చెరువుల్లో 1.20 కోట్ల చేప పిల్లలను వదిలిన ప్రభుత్వం
- ఫంగస్, బ్యాక్టీరియా..పరిశ్రమల వ్యర్థాలతో నిండిన చెరువులు
- ఎదుగుదల లేక కనిపించని చేపలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: సాధారణంగా చెరువులో వదిలిన చేపపిల్ల (35–40 ఎంఎం సైజు) కిలో బరువు పెరగాలంటే కనీసం పది నెలలు పడుతుంది. చెరువుల్లో వీటిని వదిలి ఆరు మాసాలు కూడా దాటలేదు. ఇప్పటికే మెజార్టీ చెరువులు/కుంటలు ఎండిపోయాయి. అక్కడక్కడా ఒకటి రెండు చెరువుల్లో కొద్దిపాటి నీరు కన్పిస్తున్నా.. పూర్తిగా కలుషితమై ప్రమాదకరమైన బ్యాక్టీరియా, ఫంగస్‌తో నిండిపోయాయి. సాధారణంగా వేసవిలో చెరువులోని నీరు దగ్గర పడిందని భావించి మత్స్యకారులు వల విసిరితే.. ఒక్క చేప కూడా చిక్కడం లేదు. రూ.లక్షలు వెచ్చించి.. పోసిన చేపపిల్లలు వలకు చిక్కకపోవడం ఏమిటీ? అన్న ప్రశ్న జిల్లాలోని మత్స్యకారుల మదిని తొలిచివేస్తోంది. ఇదిలా ఉంటే ఏటా ఐదు వేల టన్నుల చేపల దిగుబడి వస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ లెక్కలు చెప్పుతుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేప పిల్లల పంపిణీ ఇలా

సంవత్సరం	చెరువులు	చేపపిల్లలు	బడ్జెట్
2017–18	280	99.74 లక్షలు	రూ.62,41,039
2018–19	72	27.69 లక్షలు	రూ.21,54,180
2019–20	327	70.50 లక్షలు	రూ.41,31,002
2020–21	578	1.29 కోట్లు	రూ.70,23,773
2021–22	794	1.60 కోట్లు	రూ.1.25 కోటు
2022–23	794	1.80 కోట్లు	రూ.1.30 కోట్లు
2023–24	800	1.96 కోట్లు	రూ.1.33 కోట్లు
2024–25	700	1.20 కోట్లు	రూ.92 లక్షలు

ఉపాధి కల్పించాలని..

జిల్లాలో 121 మత్స్యకార సొసైటీలు ఉండగా, వీటిలో సుమారు ఏడు వేల మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి ఏడాదంతా జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని తీసుకొచ్చింది. మొత్తం 2,132 చెరువుల పరిధిలో 70.067 ఎకరాల ఆయకట్టు ఉంది. గత ఏడేళ్లుగా ప్రభుత్వం ఆయా చెరువులు, కుంటల్లో ఉచితంగా చేప పిల్లల్ని వదులుతున్న విషయం విదితమే. 2022లో 780 చెరువుల్లో రూ.1.30 కోట్ల విలువ చేసే సుమారు 1.80 కోట్ల చేపపిల్లలను వదలగా, 2023లో 794 చెరువుల్లో 1.96 కోట్ల చేపపిల్లలను వదిలారు. 2024 అక్టోబర్/నవంబర్‌లో 700 చెరువుల్లో 1.20 కోట్ల చేపపిల్లలను వదిలారు. తూర్పుగోదావరి, కై కలూరు, సూర్యపేట జిల్లాలకు చెందిన సీడ్ వ్యాపారులు చేపపిల్లలను సరఫరా చేశారు. 80 నుంచి 100 ఎంఎం సైజు బొచ్చ, రవ్వ, మోసు రకం చేపపిల్లలతో పాటు 35 నుంచి 40 ఎంఎం సైజు బొచ్చ, రవ్వ, బంగారు తీగ చేపపిల్లలను సరఫరా చేశారు.

వృత్తిదారులకు చేదు అనుభవం

ఎంపిక చేసిన 20 పెద్ద చెరువుల్లో 80–100 ఎంఎం సైజు చేపపిల్లలను వదలగా, మిగిలిన వాటిల్లో ఇతర సైజు పిల్లలను వదిలారు. నిర్దేశించిన చేపపిల్లలు కాకుండా నాసిరకం చేపపిల్లలను సరఫరా చేయడం, ఒక్కో ప్యాకెట్‌లో 1800 చేప పిల్లలకు 750కి మించి లేకపోవడం, పారిశ్రామిక వ్యర్థాలకు తోడు సమీప పట్టణాల్లోని మురుగునీరు వచ్చి ఆయా చెరువుల్లో చేరడం, చెరువులు/కుంటలు మురికి కూపాలుగా మారడం, ఆయా చెరువుల్లో ప్రమాదకర మైన బ్యాక్టీరియా, ఫంగస్ నిండిపోవడం, ఆశించిన స్థాయిలో నీరు లేకపోవడం వెరసి వేసిన పిల్ల వేసినట్లే కన్పించకుండా పోయింది. చెరువుల్లో నీరు దగ్గరపడటంతో చేపలు పట్టి జీవనోపాధి పొందాలని భావించిన వృత్తిదారులకు చేదు అనుభవమే ఎదురవుతోంది. వలకు బొచ్చ, బంగారు తీగ, రవ్వకు బదులు బురుకలు(పాంప్లేట్స్) చిక్కుతుండటం, మార్కెట్లో వాటికి పెద్దగా డిమాండ్ కూడా లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

ఫాంహౌస్‌లో ముజ్రా పార్టీ

- అర్ధనగ్నంగా అశ్లీల నృత్యాలు
- ఎస్ఓటీ పోలీసుల దాడి
- 13 మంది యువకులు, ఏడుగురు యువతులకు రిమాండ్
- 62 గ్రాముల గంజాయి, భారీగా మద్యం స్వాధీనం
- నిర్వాహకులతో పాటు ఫాంహౌస్ ఓనర్‌పై కేసు



ముజ్రా పార్టీలో పట్టుబడిన యువతీ, యువకులు

మొయినాబాద్: పుట్టిన రోజు వేడుకల పేరుతో ఫాంహౌస్‌లో నిర్వహిస్తున్న ముజ్రా పార్టీని ఎస్ఓటీ పోలీసులు భగ్నం చేశారు. అర్ధనగ్నంగా అశ్లీల నృత్యాలు చేస్తున్న ఏడుగురు యువతులతోపాటు 13 మంది యువకులను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని ఎత్‌బార్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన అబ్దుల్ లుక్మాన్ తన పుట్టిన రోజు సందర్భంగా స్నేహితులకు పార్టీ ఇచ్చేందుకు ఎత్‌బార్‌పల్లి రెవెన్యూలోని హాలీడే హోమ్ ఫాంహౌస్‌ను అద్దెకు తీసుకున్నాడు. నగరంలోని యూసుఫ్‌గూడ, బోరబండ, సికింద్రాబాద్, ఖైరతాబాద్, లింగంపల్లి, బోయిన్‌పల్లి, గోల్కొండ, టోలిచౌకి, పాతబస్తీ, ఆసిఫ్‌నగర్, జీడిమెట్ల ప్రాంతాలకు చెందిన 12 మంది స్నేహితులను బర్త్‌డే పార్టీకి తీసుకొచ్చాడు. వారితోపాటు కొంత కాలంగా నగరంలోని సికింద్రాబాద్, రాజేంద్రనగర్, రాంనగర్, మెహదీపట్నం ప్రాంతాల్లో ఉంటున్న పశ్చిమబెంగాల్, మహారాష్ట్రలకు చెందిన ఏడుగురు యువతులను సైతం ఫాంహౌస్‌కు తీసుకొచ్చారు. అందరూ కలిసి మద్యం, గంజాయి సేవిస్తూ మత్తులో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు అర్ధరాత్రి ఫాంహౌస్‌పై దాడి చేశారు. పట్టుబడిన యువతులను బాబు, రీనా అనే వ్యక్తులు తీసుకొచ్చినట్లు తెలిసింది. వీరిలో ఓ యువతి గతంలో జరిగిన ము జ్రా పార్టీలో సైతం పట్టుబడినట్లు సమాచారం.

గంజాయి, మద్యం స్వాధీనం

ఘటనా స్థలంలో 62 గ్రాముల గంజాయి, భారీగా మద్యం బాటిళ్లు లభించాయి. నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువతీయువకులను మొయినాబాద్ పీఎస్‌కు తరలించి విచారణ చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం వీరిని సీన్‌రీ కన్‌స్ట్రక్షన్ యువతీయువకులను ఫాంహౌస్‌కు తీసుకెళ్లారు. అనంతరం కేసు నమోదు చేసి బుధవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. ఫాంహౌస్ యజమానిపై కేసు చేసినట్లు తెలిపారు.

ఎస్‌హెచ్‌ఓకు చీవాట్లు..?

ఎత్‌బార్‌పల్లి ఫాంహౌస్‌లో జరిగిన ముజ్రా పార్టీ విషయంలో మొయినాబాద్ ఎస్‌హెచ్ఓకు పోలీసులు ఉన్నతాధికారులు చీవాట్లు పెట్టినట్లు తెలిసింది. రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు వచ్చే వరకు మీరేం చేస్తున్నారని, ఇలాంటి ఘటనలపై నిఘా పెట్టకూడదా అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం.

'ఫ్యూచర్'తో ఉద్యోగావకాశాలు



యాచారం: భోజనశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, అమెజాన్ సంస్థ ప్రతినిధులు

- అమెజాన్ సంస్థ సేవలు అభినందనీయం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: కాంగ్రెస్ సర్కార్ ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తుండడంతో ప్రపంచం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అమెజాన్ సంస్థ గునుగల్ ఆదర్శ కళాశాల, పాఠశాలను దత్తత తీసుకుని రూ.కోటిన్నరకు పైగా నిధులతో కిచెన్, భోజనశాల అలాగే గదులకు పెయింటింగ్ తదితర అభివృద్ధి పనులను చేపట్టింది. బుధవారం వాటిని ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేసి ఫోర్త్‌సిటీ(ఫ్యూచర్)ని నిర్మిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దిగ్గజ కంపెనీలు ఇక్కడ రూ.లక్ష 40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసమే ఫ్యూచర్‌సిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని నిర్మిస్తుందని తెలిపారు. అమెజాన్ సంస్థ ఈ ప్రాంతంలో పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అమెజాన్ సంస్థ ప్రతినిధులు ఓంకార్, ట్రైలర్, పార్థసారథి, ఆదర్శ కళాశాల, పాఠశాలల అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌చారి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, గునుగల్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో గ్రంథాలయ ఏర్పాటుకు కృషి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తులేకలాన్ గ్రామంలో అమెజాన్ సహకారంతో నూతన గ్రంథాలయం నిర్మాణం కోసం ఎమ్మెల్యే రంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూధన్‌రెడ్డిలు కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న పోటీ ప్రపంచంలో చదువులు విలువై పోయాయన్నారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, మాజీ సర్పంచ్ సమతరాంరెడ్డి, నాయకులు శశాంక్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పాండు, మహేందర్, విజయ్, శివ, ప్రభు, సంజీవ, శ్రీను, చింటురెడ్డి, మల్లేష్, బీరప్ప, దాసు, శంకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం.. ఉద్రిక్తం



కూల్చివేసిన ప్రీకాస్ట్ నిర్మాణాలు



ఘర్షణ వాతావరణంలో ఇరువర్గాలు

- అనుచరులతో వచ్చి ప్లాట్లు, ప్రీకాస్ట్‌లను ధ్వంసం చేసిన వ్యక్తులు
- తిరగబడిన బాధితులు
- పలు వాహనాలు ధ్వంసం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 240, 241, 242లోని నెలకొన్న భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం తెల్లవారుజామున కబ్జాదారులు ప్లాట్ల కడీలు, ప్రీకాస్ట్‌లను తొలగించడంతో పాటు, నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని కూల్చడానికి ప్రయత్నిస్తుండగా ఒక్కొక్కరుగా చేరుకున్న ప్లాట్లు, ఇళ్ల యజమానులు, పక్క కాలనీవాసులు తిరగబడటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది.

వివరాలు ఇవీ..

గుండ రాజమ్మ అనే మహిళ తన వారసత్వాటాగా రావాల్సిన ఆస్తి ఇవ్వలేదని 1984లో కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమెకు సెప్టెంబర్ 2024లో అడ్వకేట్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 240లోని 10.09 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయిస్తున్నట్లు కోర్టు తీర్పు ఇచ్చింది. దీని ఆధారంగా భూమిని ఆళ్ల రామకృష్ణ, సలాం, రిజ్వాన్ అనే ముగ్గురు వ్యక్తులకు ఆమె జీపీఏ చేసింది. వాళ్లు 2025 మార్చి నెల 26న ఇదే సర్వే నంబర్‌లోని వ్యవసాయ పొలానికి కంచె వేసే ప్రయత్నం చేయడంతో పాటు, పలు ఇళ్లు, ప్రీకాస్ట్ నిర్మాణాలను కూల్చి వేయించారు. దీంతో ఇక్కడ భూ వివాదం రాజుకుంది. ప్లాట్లు, ఇళ్ల యజమానులతో పాటు, పొలానికి చెందిన రైతులు కూడా కోర్టులను ఆశ్రయించారు. ఇటీవల 1.10 గుంటల పొలానికి ఇంజక్షన్ ఆర్డర్ వచ్చింది. అప్పటి నుంచి భూమిని కబ్జాలోకి తీసుకోవాలని భావిస్తున్న వారి అనుచరులు కాలనీలో నివసించే వారిని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారు.

ఆలస్యంగా పోలీసుల రాక

ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతున్న పోలీసులు సుమారు గంటన్నర తరువాత సంఘటనా స్థలానికి చేరుకోవడం ఉద్రిక్త పరిస్థితులకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్లాట్ల యజమానులు 100కు డయల్ చేయడంతో ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. దీంతో అప్పటికే అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేశాక పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఏసీపీ కాశిరెడ్డి, ఎస్ఓటీ ఏసీపీ షాకీర్ హుస్సేన్, సీఐ శ్రీనివాస్‌లు పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు ఇరువర్గాల మీద కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

తేనేటీగలు లేవడంతో

ఈ విషయాన్ని ఎమ్మెల్యే రంగారెడ్డి దృష్టికి తీసుకునేందుకు ప్లాట్లు, ఇళ్ల యజమానులు తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఇక్కడ వీరికి జీపీఏ చేసుకున్న ఆళ్ల రామకృష్ణ తారసపడ్డాడు. దీంతో మాటామాటా పెరిగింది. ఒక్కసారిగా ఒకరిని ఒకరు తోసుకున్నారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడ చెట్టుకున్న తేనే తెట్టును రాయితో కొట్టడంతో ఒక్కసారిగా తేనెటీగలు లేచాయి. దీంతో ఎమ్మెల్యేతో సహా అంతా అక్కడి నుంచి పరుగులు తీశారు.

వంద మంది జేసీబీతో వచ్చి..

సుమారు వంద మంది బుధవారం తెల్లవారుజామున జేసీబీతో వచ్చి ప్లాట్ల కడీలను ధ్వంసం చేయడంతో పాటు, ప్రీకాస్ట్ నిర్మాణాలను కూల్చివేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద వెళ్తుండగా ప్లాట్లు, ఇళ్ల యజమానులు అక్కడికి చేరుకున్నారు. ఆపాలని ప్రాధేయపడుతున్నా వినకుండా కబ్జాకు వచ్చిన వారి అనుచరులు ఒక్కసారిగా రాళ్లదాడి మొదలు పెట్టారు. దీంతో ప్లాట్లు, ఇళ్ల యజమానులు ఒకరికి ఒకరు సమాచారం చేరవేయడంతో అక్కడికి పదుల సంఖ్యలో చేరుకున్నారు. వీరికి పక్క కాలనీల వాసులు కూడా తోడవ్వడంతో ప్లాట్లను ధ్వంసం చేస్తున్న వారిని తరిమారు. ఈ క్రమంలో జేసీబీ, ఆటో, పలు బైక్‌లను ధ్వంసం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓ బైక్‌కు నిప్పు పెట్టారు. అదే సమయంలో మెహిదీపట్నం నుంచి కూలీ పని ఉందని చెప్పి ఓ బస్సులో మహిళలను తీసుకురావడంతో వారిని సైతం తరిమికొట్టారు. అదే సమయంలో ఆ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ఈ సంఘటనలో కొందరు ప్లాట్ల యజమానులకు, కూలీకి వచ్చిన వారికి స్వల్ప గాయాలయ్యాయి.

ఫెన్సింగ్ పనులు నిలిపేయండి

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో వెంటనే సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపేయాలని సీపీఎం నాయకులు బుధవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో సీఐని కలిసి వెంటనే సర్వే, ఫెన్సింగ్ నిర్మాణ పనులు ఆపాలని కోరారు. అసైన్డ్‌దారులకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని అన్నారు. అదే విధంగా ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లు ఇచ్చి మూడేళ్లు అవుతున్నా నేటికి కబ్జాలు చూపించి, రిజిస్ట్రేషన్లు చేయలేదని ఆరోపించారు. వెంటనే ఫెన్సింగ్ పనులు నిలిపేయాలని లేని పక్షంలో ఆందోళన నిర్వహించి, పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దయ్య, లాజర్, జంగయ్య, కుమార్, భూషణ్, పెంటయ్య, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

అనంతగిరి: గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడు 60–65 ఏళ్ల వయసు కలిగి ఉందన్నారు. దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న ఫెన్సింగ్ పనులు

యాచారం: మండల పరిధిలో ఫార్మాసిటీకి సేకరించిన భూముల సర్వే ఫెన్సింగ్ పనులు కొనసాగుతున్నాయి. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాల బౌండరీలో బుధవారం టీజీఐఐసీ, సర్వే, రెవెన్యూ సిబ్బంది ఫార్మాసిటీ భూములకు ఫెన్సింగ్ పనులు చేపట్టారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును నిర్వహించారు. ఫార్మాసిటీ భూముల్లోకి రైతులేవరు రాకుండా ఏర్పాట్లు చేశారు. గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు ఫార్మాసిటీకి భూములు సేకరించిన గ్రామాల్లో రైతుల కదలికలపై నిఘా పెట్టారు. ఐదో రోజు కూడా ఇద్దరి ఏసీపీలు, 8 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, వందకు మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నానక్‌నగర్‌లో ఫెన్సింగ్ పనులను పర్యవేక్షిస్తున్న ఏసీపీ రాజు తదితరులు

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



ఎరువులు సరఫరా చేసే ప్రక్రియను వివరిస్తున్న అధికారులు

ఉద్యానవనశాఖ అధికారి హిమబిందు

కొందుర్గు: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవనశాఖ అధికారి హిమబిందు అన్నారు. బుధవారం కొందుర్గు రైతువేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు కూలీల ఖర్చు తక్కువగా ఉంటుందని, చీడపీడల బాధ ఉండదన్నారు. పంట నాటిన మూడు సంవత్సరాల అనంతరం నిరంతర దిగుబడులు పొందవచ్చన్నారు. ఆయిల్‌పామ్ డీజీఎం రామ్‌మోహన్ మాట్లాడుతూ..సాగు చేసే రైతులకు ఎరువుల వాడకం, పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ పంట దిగుబడులను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాకేష్, ఏఈఓలు వాసవి, రమణ, నిఖిల్, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించండి

షాద్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నిధులను మంజూరు చేసి పనులు వెంటనే ప్రారంభించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్, కో కన్వీనర్ మాదారం నర్సింలు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి 2013లో అనుమతి ఇచ్చారని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పట్టించుకోలేదని ఆరోపించారు. ఇటీవల రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నార్లాపూర్, ఏదుల, కరివెన, రిజర్వాయర్ పరిధిలో ఉన్న పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలను ఇచ్చారని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు నిధులను మంజూరు చేయడంతో పాటుగా రిజర్వాయర్ నిర్మాణానికి కావాల్సిన భూమి సేకరణ పనులను చేపట్టి ఇక్కడి రైతులకు నమ్మకం కలిగించాలని పేర్కొన్నారు.

బీసీసేన అసెంబ్లీ యువజన అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణయాదవ్

షాద్‌నగర్: పట్టణంలోని బీసీ సేన కార్యాలయంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కత్తిచంద్ర శేఖరప్ప ఆధ్వర్యంలో బుధవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ సమక్షంలో అసెంబ్లీ యువజన అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పాలాది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. దేశంలో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, ఉపాధి రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించకపోవడంతో అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని ఆరోపించారు. బీసీల ఓట్లతో గెలిచిన నాయకులు అధికారంలో వచ్చాక వారి సమస్యలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం బీసీలు ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చి సంఘటితంగా పోరాటం చేయాలని సూచించారు. అనంతరం నూనతంగా ఎన్నికైన శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా యువజన కార్యదర్శి శివ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపులపై దాడులు

గుట్కా, మద్యం బాటిళ్లు స్వాధీనం

కొందుర్గు: విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం పోలీసులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరాణ దుకాణాలపై దాడులు చేసి నిషేధిత గుట్కా, అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను పట్టుకున్నారు. షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొందుర్గులో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించామని, ఇందులో భాగంగా 20 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు సీజ్ చేశామన్నారు. అదే విధంగా అనుమతి లేకుండా కిరాణ షాపుల్లో విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు, నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎస్సై రవీందర్ నాయక్ తోపాటు దాదాపు 50 మంది పోలీసులు దాడుల్లో పాల్గొన్నారు.



దాడుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నర్సయ్య

నిబంధనలు పాటించాలి

కేశంపేట: ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు నింబధనలు పాటించాలని సీఐ నరహరి అన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మండల పరిధిలోని అల్వాల, కొత్తపేట, కేశంపేట గ్రామాల్లో వాహనాల తనిఖీలు, కిరాణ షాపుల్లో చెక్కింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరహరి మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో కూలీ ఆత్మహత్య

తాండూరు రూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని సిరిగిరిపేట్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇంటింటి ఈశ్వరప్పకు ముగ్గురు కొడుకులు. అందరికి వివాహం కావడంతో వేరువేరు కాపురాలు పెట్టారు. పెద్ద కుమారుడు వీరేశం(37) కూలీ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. కొంతకాలంగా ఆయన మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంటి పరిసరాల్లో వీరేశం ఉరేసుకున్నాడు. ఉదయం ఇంటి ఆవరణలో విగతజీవిగా పడి ఉండటాన్ని ఆయన భార్య పుష్పమ్మ చూసి కుటుంబసభ్యులకు తెలిపింది. మద్యానికి బానిసై తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఈశ్వరప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొంరాస్‌పేట: మండల పరిధిలోని దుప్‌చర్లలో ఇసుకను నిల్వచేసి అక్కడి నుంచి అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టరును మంగళవారం రాత్రి పోలీసులు పట్టేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవూఫ్ తెలిపారు. తహసీల్దారు అనుమతులు ఉన్న చోట కాకుండా అక్రమంగా మరో చోటునుంచి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు ట్రాక్టరును పట్టివేశారు.

చిప్పలపల్లిలో షార్ట్ సర్క్యూట్

విలువైన విద్యుత్ పరికరాలు దగ్ధం

కందుకూరు: షార్ట్ సర్క్యూట్‌తో పలు గృహాల్లో మంటలు చెలరేగి విద్యుత్ పరికరాలు, విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన కందుకూరు మండలం చిప్పలపల్లిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. చిప్పలపల్లిలోని ఎస్ఆర్‌నగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా అయ్యే 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ఇళ్లల్లోకి వచ్చే ఎల్‌టీ విద్యుత్ లైన్‌పై పడ్డాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పలు ఇళ్లల్లోని విద్యుత్ పరికరాలు, ఫ్రిడ్జ్‌లు, టీవీలు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు, వైరింగ్ దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇళ్లలో ఉన్న వారంతా భయాందోళనలకు గురై బయటికి పరుగెత్తారు. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా బుధవారం ఏఈ వేణుగోపాల్‌రెడ్డి ఘటనా స్థలంకు చేరుకుని వివరాలు సేకరించారు. నష్టపరిహారం విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.



దగ్ధమైన స్విచ్ బోర్డు ఇతర పరికరాలు

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

బొంరాస్‌పేట: వేసవితాపానికి ఉపశమనం కోసం ఇంట్లో పెట్టుకున్న కూలర్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన మండల పరిధిలోని తుంకిమెట్లలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సఫియాబేగం ఇంట్లో మధ్యాహ్నం కూలర్ ఆన్‌చేసుకొని ఉండగా కొద్దిసేపటికి అందులోంచి మంటలు వ్యాపించాయి. చూస్తుండగానే వేగంగా వ్యాప్తి చెందడంతో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. కుటుంబ సభ్యులు అరవడంతో కాలనీవాసులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక వాహనంతో సిబ్బంది మంటలు పూర్తిగా చల్లార్చారు. ఇంట్లో ఉన్న నగదు, బంగారం, వస్తువులు కాలిపోయాయని బాధితురాలు వాపోయింది. రూ.6లక్షల మేర నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది.

పల్లెల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామ పంచాయతీ పిట్టలగడ్డ తండాలో రూ.70లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ, సీసీరోడ్లు, కందివనం గ్రామంలో రూ.9లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, సూర్యప్రకాశ్, శ్రీనివాస్, అనంతం, తుపాకుల శేఖర్, నవీన్, శ్రీధర్‌రెడ్డి, రాజు, యాదయ్య, రఘురాం, సర్దార్, ప్రసాద్, రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పిట్టలగడ్డ తండాలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పరామర్శ

అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ నేత చెంది తిరుపతిరెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే నాయకుడితో మాట్లాడి వివరాలు తెలుసుకొని, ధైర్యం కల్పించారు.